# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..






నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 02 | పేజీలు : 8 | శనివారం | 10 జనవరి 2026 | వెల : 2/-


# పంచాయతీ వద్దు... పరిష్కారం కావాలి

- సీఎం రేవంత్ రెడ్డి



- పక్క రాష్ట్రాలతో వివాదాలు కోరుకోవడం లేదు
- చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలి
- పంచాయతీ కావాలా..! నీళ్లు కావాలా..! అని అడిగితే తెలంగాణ రాష్ట్రానికి నీళ్లు కావాలని కోరుకుంటాం
- నీటి వివాదాల విషయంలో తెలంగాణ శాశ్వత పరిష్కారం కోరుకుంటోంది
- రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వెళ్లాలి
- సీఎం రేవంత్ రెడ్డి

డెస్క్, జనవరి 09 (తొలివెలుగు): నదీ జలాల విషయంలో పక్క రాష్ట్రాలతో వివాదాలు కోరుకోవడం లేదని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నదీ జలాలకు సంబంధించి పంచాయతీ కావాలా..! నీళ్లు కావాలా..! అని అడిగితే తెలంగాణ రాష్ట్రానికి నీళ్లు కావాలని కోరుకుంటామని చెప్పారు. నదీ జలాలపై రాజకీయ ప్రయోజనం పొందాలని ప్రభుత్వం భావించడం లేదని, రాజకీయాలకు అతీతంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నామని అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలోని ఈ-సిటీలో నెలకొల్పిన సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్ ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తెలంగాణ జల వివాదాలను ప్రస్తావించారు. "పక్క రాష్ట్రాలతో తెలంగాణ వివాదాలను కోరుకోవడం లేదు. న్యాయస్థానాల ముందుకు లేదా మరెవరి వద్దనో పంచాయతీ పెట్టుకునే కన్నా సమస్యపై కూర్చొని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. నీటి వివాదాల విషయంలో తెలంగాణ శాశ్వత పరిష్కారం కోరుకుంటోంది. అభివృద్ధి సాధించాలంటే పక్క రాష్ట్రాల సహకారం, సయోధ్య ఉండాలి. రాజకీయాలకు అతీతంగా పరిష్కారం కోసం అందరూ సహకరించాలి.." అని పక్క రాష్ట్ర ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు...

2

## కాంగ్రెస్ ప్రభుత్వం సీరియల్ స్నాచర్‌గా వ్యవహరిస్తోంది

- కేటీఆర్


- ఉర్దూ వర్సిటీ భూములకు సంబంధించి ప్రభుత్వం నోటీసులు
- నందినగర్‌లో విద్యార్థులతో సమావేశమైన కేటీఆర్
- కాంగ్రెస్ ప్రభుత్వం సీరియల్ స్నాచర్‌గా వ్యవహరిస్తోందని వ్యాఖ్య



డెస్క్, జనవరి 09 (తొలివెలుగు) : కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ భూములకు సంబంధించి ప్రభుత్వం నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో నందినగర్‌లో విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం సీరియల్ స్నాచర్‌లా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం భూములు లాక్కోవడం ఇదే మొదటిసారి కాదని ఆయన అన్నారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి కూడా 100 ఎకరాలు తీసుకున్నారని, ఈ విషయానికి సంబంధించి విద్యార్థులు పోరాడినప్పటికీ ఆందోళనను అణిచివేశారని అన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం లోనూ ఇదే విధమైన భూదందా చేశారని మండిపడ్డారు. అక్కడ 400 ఎకరాలు తీసుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుమోటోగా తీసుకుని ఆదేశాలు ఇచ్చేవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదని అన్నారు.

## సంక్రాంతి రద్దీకి చెక్..

- సంక్రాంతి రద్దీని తగ్గించేందుకు పంతంగి టోల్ ప్లాజా వద్ద కొత్త టెక్నాలజీ
- శాటిలైట్, కెమెరాలతో ఆటోమేటిక్‌గా టోల్ వసూలుపై ట్రయల్ రన్
- ట్రయల్స్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు గుర్తింపు.. పరిష్కారంపై అధికారుల దృష్టి
- హైవేపై టోల్ ఫీజు మినహాయింపునకు కేంద్ర ప్రభుత్వం నిరాకరణ



డెస్క్, జనవరి 09 (తొలివెలుగు) : సంక్రాంతి పండుగ ప్రయాణాలు మొదలవడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరుగుతోంది. ముఖ్యంగా పంతంగి టోల్ ప్లాజా వద్ద ఏటా కిలోమీటర్ల మేర నిలిచిపోయే ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు నేషనల్ హైవే అథరిటీ ఆఫ్ ఇండియా ఈసారి ఒక నూతన టెక్నాలజీని ప్రయోగాత్మకంగా చేస్తోంది. వాహనాలు ఆగకుండానే, కేవలం మూడు సెకన్లలో టోల్ వసూలు చేసేందుకు వీలుగా శాటిలైట్ ఆధారిత ఆటోమేటిక్ విధానాన్ని ....

2

## ఈ నెల 28 నుంచి కేంద్ర బడ్జెట్ సమావేశాలు..

- రెండు విడతలుగా ఏప్రిల్ 2 వరకు పార్లమెంటు సమావేశాలు కొనసాగింపు
- అరుదుగా ఆదివారం రోజున ఫిబ్రవరి 1న బడ్జెట్ సమర్పణ
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో సభ ప్రారంభం
- షెడ్యూల్ వెల్లడించిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు



డెస్క్, జనవరి 09 (తొలివెలుగు) : 2026 సంవత్సరానికి సంబంధించిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ ఖరారైంది. జనవరి 28 నుంచి ఈ సమావేశాలు జరగనున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈసారి కేంద్ర బడ్జెట్‌ను ఆదివారం రోజున ప్రవేశపెట్టే అవకాశం ఉండటం ఈ సమావేశాల ప్రత్యేకతగా నిలవనుంది....

2

## శ్రీవారి మెట్టు మార్గంలో చిరుత కలకలం..

- రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేత



డెస్క్, జనవరి 09 (తొలివెలుగు) : తిరుమల శ్రీవారి మెట్టు నడక మార్గంలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపింది. ఈ మార్గంలోని 400వ మెట్టు సమీపంలో చిరుత సంచరిస్తున్నట్లు కొందరు భక్తులు గుర్తించి, వెంటనే టీటీడీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో భద్రతా సిబ్బంది హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు శుక్రవారం ఉదయం శ్రీవారి మెట్టు మార్గంలో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. మార్గం మొత్తం విస్తృతంగా తనిఖీలు చేపట్టి, చిరుత కదలికలు లేవని నిర్ధారించుకున్న తర్వాత భక్తులను తిరిగి అనుమతించారు. ఈ నేపథ్యంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా కాకుండా గుంపులుగా ప్రయాణించాలని అధికారులు సూచించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, భక్తులు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. గత కొంతకాలంగా అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గాల్లో చిరుతలు, ఎలుగుబంట్ల సంచారం తరచుగా నమోదవుతుండటంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే టీటీడీ ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘాను పటిష్ఠం చేసింది. రాత్రి వేళల్లో భక్తులను గుంపులుగా అనుమతించడం, అటవీ ప్రాంతాల్లో ఆహార పదార్థాలు పడేయవద్దని సూచించడం వంటి జాగ్రత్తలు తీసుకుంటున్న విషయం తెలిసిందే.

## డీజీపీ నియామకాన్ని సవాల్ చేస్తూ పిటిషన్..

- డిస్మిస్ చేసిన తెలంగాణ హైకోర్టు

- శివధర్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట
- నాలుగు వారాల్లో డీజీపీ నియామక ప్రక్రియ పూర్తి చేయాలని యూపీఎస్సీకి ఆదేశం
- ఫిబ్రవరి 5లోగా కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచన
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా నియామకం జరిగిందని పిటిషన్ దాఖలు

2



## ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

- ఉద్యోగులకు రూ.1.02 కోట్ల ప్రమాద బీమా అందించనున్నట్లు వెల్లడి
- 5.14 లక్షల మంది ఉద్యోగుల కుటుంబాలకు ప్రయోజనం
- సింగరేణి, విద్యుత్ సంస్థల్లో ఇప్పటికే రూ.1 కోటికి పైగా బీమా

డెస్క్ జనవరి 09 (తొలివెలుగు) : తెలంగాణ సర్కారు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంక్రాంతి కానుకను ప్రకటించింది. ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ.1.02 కోట్ల ప్రమాద బీమాను అందించనున్నట్లు వెల్లడించింది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని 5.14 లక్షల మంది ఉద్యోగుల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. ఇదివరకే సింగరేణి, ట్రాన్స్‌కో, జెన్‌కో ఉద్యోగులకు రూ.1 కోటికి పైగా బీమా అందుతోంది. సింగరేణిలో 38 వేల మంది, విద్యుత్ సంస్థల్లో 71 వేల మందికి పైగా ఉద్యోగులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. అదే తరహాలో ప్రభుత్వ ఉద్యోగులందరికీ ప్రమాద బీమాను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రమాద బీమా అమలు కోసం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రముఖ బ్యాంకర్లతో చర్చలు జరిపారు. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన అన్నారు.

# పంచాయతీ వద్దు.. పరిష్కారం కావాలి

- సీఎం రేవంత్ రెడ్డి



మొదటిపేజీ తరువాయి..

కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు అడ్డంకులు సృష్టించరాదని ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి విజ్ఞప్తి చేశారు. జల వివాదాలపై శాశ్వత పరిష్కారం, రాష్ట్ర ప్రయోజనాలపై వివాదాలను కోరుకోవడం లేదని, సమస్యల పరిష్కారం కోసం సహకరించాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన పాలమూరు -- రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి, ఎస్ఎల్బీసీ, బీమా, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాల వల్ల పర్యావరణం, సీడబ్ల్యూసీ నుంచి సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన నిధులు, అనుమతులు కూడా రావడం లేదని, తద్వారా రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని చెప్పారు. రాజకీయ ప్రయోజనాలకన్నా ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసం ఆలోచన చేస్తున్నామని, పరస్పర సహకారం అవసరమని అన్నారు. పోర్టు కనెక్టివిటీ లేని తెలంగాణకు మచిలీపట్నం పోర్టుతో కనెక్టివిటీ కోసం 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ వే, రైల్వే కనెక్టివిటీతో సహా అనుమతి అడిగామని, ఆ కనెక్టివిటీని అభివృద్ధి చేయాలంటే పక్క రాష్ట్రం సహకారం అవసరమని చెప్పారు. అలాగే, ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి చెందాలంటే తెలంగాణ సహకారం అవసరం ఉంటుందని, పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలతో పరస్పర సహకారాన్ని మాత్రమే కోరుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వెళ్లాలని, చర్చల ద్వారా సమస్యల సంపూర్ణ పరిష్కారం కోసం ముందుంటామని అన్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ మూడు భాగాలుగా అభివృద్ధి లక్ష్యలను నిర్దేశిస్తూ గ్లోబల్ సమ్మిట్ లో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేశామని వివరించారు. తెలంగాణ ప్రపంచంలో జర్మనీ, జపాన్, సౌత్ కొరియా, న్యూయార్క్ లతో పోటీ పడాలని సంకల్పించామని, అందులో భాగంగానే యువ పారిశ్రామిక వేత్తలు ప్రారంభించే పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రపంచ నగరాలతో పోటీ పడే విధంగా ఐటీ, ఫార్మా, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్, డేటా సెంటర్స్ వాటిల్లో పోటీ పడగలుగుతున్నాం. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే ప్రైవేటు రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రం అభివృద్ధి సాధించడానికి పారిశ్రామిక, విద్యుత్, పర్యాటక, దేవాదాయ, వైద్య రంగాల్లో ప్రభుత్వం పాలసీలు తీసుకొచ్చిందని, విద్యా రంగంలోనూ సరికొత్త పాలసీని ప్రకటించబోతున్నాం. పెట్టుబడులను ఆకర్షించడానికి పారదర్శకమైన ప్రణాళికలు రూపొందించాం. భారత్ ఫ్యూచర్ సిటీ వల్ల ఇక్కడి భూముల ధరలు పెరుగుతాయి. అభివృద్ధికి అందరూ సహకరించాలి. అందరి సహకారం ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుంది. 1995 నుంచి 2025 వరకు 30 ఏళ్ల నిరంతర శ్రమ వల్ల హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడుతోందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో దక్షణ భారత దేశంలోనే ఐవీ ఫ్లూయిడ్స్ తయారీకి సంబంధించి సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. ఇంకా ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, శాసనమండలిలో చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# హిమాచల్ ప్రదేశ్ లో ఘోర బస్సు ప్రమాదం

## -12 మంది మృతి



డెస్క్, జనవరి 09 (తొలివెలుగు) :
హిమాచల్ ప్రదేశ్‌లో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సిర్మౌర్ జిల్లాలో ప్రయాణికులతో వెళుతున్న ఓ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి సుమారు 200 మీటర్ల లోతైన లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 33 మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. సిమ్లా నుంచి కుప్వీకి వెళుతున్న ఈ బస్సులో మొత్తం 45 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరంతా 'పోష్ణ పండుగ సందర్భంగా తమ స్వగ్రామాలకు తిరిగి వెళుతున్నారు. హరిపుర్‌ధార్ మార్కెట్‌కు సమీపంలో మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో బస్సు ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దట్టమైన పొగమంచు కారణంగా బస్సు రోడ్డుపై నుంచి జారిపోయి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాద తీవ్రతకు బస్సు నుజ్జునుజ్జయింది. ప్రమాద సమాచారం అందిన వెంటనే స్థానికులు, పోలీసులు, ఆరోగ్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలోని నాహన్, రాజ్‌గఢ్ ఆసుపత్రులకు తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన చికిత్స కోసం సిమ్లాలోని ఐజీఎంసీ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రమాదంపై మెజిస్టీరియల్ విచారణకు కూడా ప్రభుత్వం ఆదేశించింది.

# సంక్రాంతి రద్దీకి చెక్

మొదటిపేజీ తరువాయి..


పరీక్షిస్తోంది. ఇందులో భాగంగా యాదాద్రి జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద నిన్న సాయంత్రం ట్రయల్ రన్ నిర్వహించారు.

విజయవాడ వైపు వెళ్లే 8 టోల్ బూత్‌లలో ఈ ట్రయల్ రన్ చేపట్టారు. ఈ విధానంలో కెమెరాలు వాహనం నంబర్ ప్లేట్‌ను గుర్తించగానే, సెన్సార్లు ఫాస్టాగ్‌ను స్కాన్ చేసి ఆటోమేటిక్‌గా టోల్ రుసుమును వసూలు చేస్తాయి. ఈ పరీక్షల సమయంలో కొన్ని వాహనాలకు టోల్ ఫీజు సరిగ్గా కట్ కాకపోవడం వంటి సాంకేతిక సమస్యలను అధికారులు గుర్తించారు. పండుగ రద్దీ ప్రారంభమయ్యేలోపు ఈ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ఎన్‌హెచ్ఏఐ, టోల్ ప్లాజా సిబ్బంది ప్రయత్నిస్తున్నారు.

సంక్రాంతికి ఊహించిన దానికంటే ఎక్కువ రద్దీ ఉండే అవకాశం ఉన్నందున, విజయవాడ మార్గంలో అదనంగా మరో రెండు టోల్ బూత్‌లను తెరవాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ కౌంటర్లలో మాత్రం హ్యాండ్‌గన్‌లతో ఫాస్టాగ్‌లను స్కాన్ చేసి టోల్ వసూలు చేస్తారు. ఈ విధానాన్ని కూడా ట్రయల్ రన్‌లో పరీక్షించారు. ప్రస్తుతం హైదరాబాద్-విజయవాడ హైవేపై కేవలం పంతంగి వద్ద మాత్రమే ఈ కొత్త టెక్నాలజీని అమలు చేస్తున్నారు.

ఇదిలా ఉంటే... పండుగ సందర్భంగా జనవరి 9 నుంచి 18 వరకు హైదరాబాద్-విజయవాడ హైవేపై టోల్ ఫీజు రద్దు చేయాలని తెలంగాణ ఆర్ అండ్ బీ శాఖ కేంద్రాన్ని కోరింది. అయితే, ఈ అభ్యర్థనను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించినట్లు సమాచారం. టోల్ మినహాయింపు సాధ్యం కాదని తెలియజేసినట్లు తెలుస్తోంది.

# ఈ నెల 28 నుంచి కేంద్ర బడ్జెట్ సమావేశాలు..



మొదటిపేజీ తరువాయి..

రెండు విడతలుగా సాగే ఈ సమావేశాలు ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి.

**రాష్ట్రపతి ఆమోదం.. అధికారిక ప్రకటన**

కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు, పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచడానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారని మంత్రి కిరణ్ రిజిజు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. "2026 బడ్జెట్ సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు జరుగుతాయి. తొలి విడత సమావేశాలు ఫిబ్రవరి 13తో ముగుస్తాయి. అనంతరం మార్చి 9న సభ తిరిగి సమావేశమవుతుంది. అర్థవంతమైన చర్చలకు, ప్రజలు కేంద్రంగా సాగే పాలనకు ఈ సమావేశాలు అత్యంత కీలకం" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

**ఆదివారం బడ్జెట్.. ఒక అరుదైన ఘట్టం**

నివేదికల ప్రకారం, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఫిబ్రవరి 1 ఆదివారం కావడం గమనార్హం. పార్లమెంట్ చరిత్రలో ఆదివారం రోజున బడ్జెట్ ప్రవేశపెట్టడం చాలా అరుదు. దీనికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఇక బడ్జెట్‌కు ముందు, దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరును సమీక్షించే ఆర్థిక సర్వేను జనవరి 29 లేదా 30న పార్లమెంట్ ఉభయ సభల ముందు ఉంచనున్నారు.

**రెండు విడతలుగా సమావేశాలు.. ఎందుకంటే?**

ఈ బడ్జెట్ సమావేశాలను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి విడత జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరుగుతుంది. ఆ తర్వాత సభకు విరామం ఉంటుంది. ఈ విరామ సమయంలో వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన పార్లమెంటరీ స్థాయీ సంఘాలు బడ్జెట్ పద్దులు, వివిధ పథకాలకు కేటాయింపులపై లోతైన సమీక్ష జరుపుతాయి. అనంతరం మార్చి 9న రెండో విడత సమావేశాలు ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. ఈ దశలో స్థాయీ సంఘాల నివేదికలపై చర్చించి, తుది ఆమోదం తెలుపుతారు.

**కీలకంగా మారనున్న బడ్జెట్ సమావేశాలు**

సంప్రదాయం ప్రకారం, సమావేశాల మొదటి రోజైన జనవరి 28న పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. ఈ ప్రసంగంలో ప్రభుత్వ విధానాలు, ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలను ఆమె వివరిస్తారు. ఆర్థిక వృద్ధి, ద్రవ్యలోటు నియంత్రణ, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన వంటి కీలక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో ఈ సమావేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పన్నులు, ప్రభుత్వ వ్యయం, విధానపరమైన సంస్కరణలపై అధికార, విపక్ష సభ్యుల మధ్య వాడివేడి చర్చలు జరిగే అవకాశం ఉంది. రాష్ట్రపతి ఆమోదంతో సమావేశాల నిర్వహణకు అధికారికంగా ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.

# డీజీపీ నియామకాన్ని సవాల్ చేస్తూ పిటిషన్..

## - డిస్మిస్ చేసిన తెలంగాణ హైకోర్టు

మొదటిపేజీ తరువాయి..

డెస్క్, జనవరి 09 (తొలివెలుగు) :
తెలంగాణ డీజీపీగా బి. శివధర్ రెడ్డి నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఆయనకు తాత్కాలికంగా ఊరట లభించింది. అదే సమయంలో, డీజీపీ నియామక ప్రక్రియను నాలుగు వారాల్లోగా పూర్తి చేయాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)ని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది.

సామాజిక కార్యకర్త టి. ధనగోపాల్ రావు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. 'పూర్తి అదనపు బాధ్యతల'తో డీజీపీని నియమించడం సుప్రీంకోర్టు 'ప్రకాశ్ సింగ్ కేసు'లో ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. శివధర్ రెడ్డి నియామకాన్ని నిలిపివేసి, నిబంధనల ప్రకారం రెగ్యులర్ డీజీపీని నియమించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

గత ఏడాది సెప్టెంబర్ 26న డీజీపీ జితేందర్ పదవీ విరమణ చేయడంతో, 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన శివధర్ రెడ్డికి ప్రభుత్వం డీజీపీగా 'పూర్తి అదనపు బాధ్యతలు' అప్పగించింది. ఈ నియామకంపై గురువారం విచారణ జరిపిన జస్టిస్ పుల్ల కార్తీక్, శుక్రవారం తీర్పును వెలువరించారు. విచారణ సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వం 2017 నుంచి డీజీపీ నియామకానికి సంబంధించిన సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను పంపలేదని యూపీఎస్సీ కోర్టుకు తెలిపింది. అయితే, తాము పంపిన ప్రతిపాదనలను యూపీఎస్సీ తిప్పి పంపుతోందని అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి వాదించారు. వాదనలు విన్న న్యాయస్థానం, డీజీపీ నియామక ప్రక్రియపై ఫిబ్రవరి 5లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

# ముందుగానే వచ్చిన 'సంక్రాంతి' శోభ

- ❖ గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో ఘనంగా పండుగ వేడుకలు
- ❖ సందడి చేసిన గంగిరెద్దులు, హరిదాసుల వేషధారణలు
- ❖ విద్యార్థులతో కలిసి పాలు పొంగించిన చైర్‌పర్సన్

చౌటుప్పల్, జనవరి 9 (తొలివెలుగు) : చౌటుప్పల్ పట్టణ పరిధిలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణను రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. విద్యార్థుల మధ్య ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్‌పర్సన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి భోగి మంటలను వెలిగించారు. సాంప్రదాయబద్ధంగా పాలను పొంగించి పూజలు నిర్వహించారు. విద్యార్థులు హరిదాసులు, గంగిరెద్దుల వేషధారణలతో అలరించగా, ఎరుకలసాని వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. పాఠశాల డైరెక్టర్ ఎస్. లక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులకు పండుగల విశిష్టతను వివరించారు. అనంతరం విద్యార్థులు గాలిపటాలు ఎగురవేస్తూ, కోలాటాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# లింగోజీగూడెం బడిలో 'సంక్రాంతి' సందడి

- ❖ కన్నులపండువగా వేడుకలు
- ❖ భారతీయ సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన
- ❖ ఆకట్టుకున్న రంగవల్లులు, గంగిరెద్దుల నృత్యాలు
- ❖ సృజనాత్మకతకు వేదికగా ముగ్గుల పోటీలు





చౌటుప్పల్, జనవరి 9 (తొలివెలుగు) : చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని లింగోజీగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి వేడుకలను శుక్రవారం అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో విచ్చేసిన విద్యార్థులు పండుగ శోభను తీసుకొచ్చారు. విద్యార్థులకు రంగవల్లులు, పతంగుల పోటీలు నిర్వహించి వారిలోని సృజనాత్మకతను ప్రోత్సహించారు. పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేసి, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల ఆటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కూరెళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. పండుగలు విద్యార్థుల్లో ఐక్యతను, సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవరెడ్డి, అరుణ, పురుషోత్తమ చారి, విజయలక్ష్మీ, రమేష్ రెడ్డి, బండి అనిల్ కుమార్ రెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కూతురిని చూసి వస్తుండగా మృత్యువు కాటు

- ❖ బైకును వెనుక నుంచి ఢీకొట్టిన అజ్ఞాత వాహనం
- ❖ రోడ్డు ప్రమాదంలో లచ్చమ్మగూడెం మహిళ మృతి
- ❖ చికిత్స పొందుతూ కన్నుమూసిన సంతోష



చౌటుప్పల్, జనవరి 9 (తొలివెలుగు) : గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, ఆమె భర్త గాయాలతో బయటపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా, నారాయణపురం మండలం, లచ్చమ్మగూడెం గ్రామానికి చెందిన దుబ్బాక నాగరాజు, సంతోష(35) దంపతులు చౌటుప్పల్‌లో నివాసముంటున్నారు. బుధవారం మధ్యాహ్నం వారు తమ ద్విచక్రవాహనంపై కొయ్యల-గూడెం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న కుమార్తెను చూసి తిరిగి వస్తుండగా, గ్రామ శివారులోని వినాయక గుడి వద్ద వెనుక నుంచి వచ్చిన ఓ వాహనం వీరిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంతోష తలకు తీవ్ర గాయా-లవ్వగా, నాగరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హయత్ నగర్‌లోని సన్‌రైజ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సంతోష రాత్రి మృతి చెందారు. భర్త నాగరాజు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కృష్ణమాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకుడు కుంజా సూర్య మెగా వాలీ బాల్ ప్రారంభం

ములుగు జిల్లా / మంగపేట, జనవరి 09 (తొలివెలుగు) : మంగపేట మండలం రాజుపేట గ్రామానికి చెందిన ములుగు జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రి నాగేంద్రబాబు ఆధ్వర్యంలో, అంబేద్కర్ యూత్ వ్యవస్థాపకతనంతో ములుగు మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయి మెగా వాలీ బాల్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య ప్రధాన అతిథిగా పాల్గొని టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కుంజా సూర్య మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ సందర్భంలో రెండు జిల్లాల స్థాయి మెగా వాలీ బాల్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం చాలా అభినందనీయం అని పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న క్రీడాకారులు స్నేహభావంతో ఆడి విజయాలు సాధించాలని అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. క్రిందుల కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి, మంగపేట మండల సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, క్రీడాకారులు తదితరులు



# మునుగోడు విద్యార్థుల గోస తీర్చండి!

- ❖ మండలాల్లో ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయాలని విన్నపం
- ❖ ఇంటర్ బోర్డు సెక్రటరీతో భేటీ అయిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి




చౌటుప్పల్, జనవరి 9 (తొలివెలుగు) : మునుగోడు నియోజకవర్గంలో విద్యా వసతుల కల్పనపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టి సారించారు. నియోజకవర్గంలోని ప్రధాన మండల కేంద్రాలైన మునుగోడు, చండూరు, మర్రిగూడెం, ఘట్టుప్పల్‌లలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను వెంటనే ప్రారంభించాలని కోరుతూ శుక్రవారం ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్యకు రిప్రజెంటేషన్ ఇచ్చారు. మునుగోడు నియోజకవర్గం భౌగోళికంగా వెనుకబడి ఉందని, స్థానికంగా కళాశాలలు లేక విద్యార్థులు పక్క నియోజకవర్గాలకు లేదా పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో భాగంగా ఈ వినతిని వెంటనే పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు.

# విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య



ములుగు జిల్లా / పస్రా, జనవరి 09 (తొలివెలుగు) : పస్రా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉత్సాహపరిచి, ఉన్నత చదువులు పూర్తి చేసి గొప్ప స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్, పస్రా సర్పంచ్ సుమలత, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింత క్రాంతి, యువ నాయకులు జక్కు రణదీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధి కోసం కుసుంబాయి తండా సర్పంచ్ చర్యలు



జనగామ జిల్లా, రఘునాథపల్లి, జనవరి 09 (తొలివెలుగు) : జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కుసుంబాయి తండా గ్రామ సర్పంచ్ కొర్ర స్వరూప రాజేందర్ నాయక్ గ్రామ అభివృద్ధి కోసం సక్రియంగా పని చేస్తున్నారు. గ్రామంలోని రోడ్ల ఇరువైపులా క్లీనింగ్ పనులు చేపట్టడం, వీధి లైట్లు ఏర్పాటు చేయడం వంటి కార్యకలాపాలను సర్పంచ్ శ్రద్ధతో నిర్వహించారు.

# కడియం శ్రీహరి నిధులతో వెల్ది గ్రామంలో సీసీ రోడ్ల పనులు సమీక్ష



జనగామ జిల్లా / రఘునాథపల్లి , జనవరి 09 (తొలివెలుగు) : జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామంలో సీసీ రోడ్లు పనులు పరిశీలించారు జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు. ఈ రోడ్డు పనులు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారి నిధుల ద్వారా, మొత్తం పది లక్షల రూపాయల ఖర్చుతో జరుగుతున్నాయి. పరిశీలన సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ రెడ్డి, మండల అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, వెల్దిగాం కాంగ్రెస్ నాయకులు మరియు ఇతర స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు. వారు పనులను పర్యవేక్షించి, రోడ్డు నిర్మాణ పనులు సమయానికి, నాణ్యతతో పూర్తవుతాయో లేదో తనిఖీ చేశారు.

# బమ్మెర గ్రామ పంచాయతీ ఆవరణలో జాతర వేలం పాట

జనగామ జిల్లా, జనవరి 09 (తొలివెలుగు) : జనగామ జిల్లా, పాలకుర్తి మండలం బమ్మెర గ్రామంలో ప్రతి సంవత్సరం కనుమ పండుగ రోజున జరిగే శ్రీ ఆలేటి ఎల్లవ్వ తల్లి జాతర సందర్భంగా, శనివారం ఉదయం 10:00 గంటలకు బమ్మెర గ్రామ పంచాయతీ ఆవరణలో వేలం పాట నిర్వహించబడుతుంది. వేడుకల్లో ముఖ్యంగా : కొబ్బరికాయలు అమ్మకం, వాహనాల పార్కింగ్ , దుకాణాల ఏర్పాటు, స్పెషల్ దర్శనం టికెట్లు , అమ్మవారి ప్రసాదంబమ్మెర గ్రామ సర్పంచ్ జిట్టబోయిన రమ్య-ప్రశాంత్ ఆసక్తిగల వ్యక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనగలరని తెలియజేశారు.



# వర్ధన్నపేట ఆసుపత్రి తరలింపుపై నిరాహార దీక్షకు జన్ను రాములు మాదిగ మద్దతు



వరంగల్/ వర్ధన్నపేట, జనవరి 09 (తొలివెలుగు) : వర్ధన్నపేట కేంద్రంలోని కొన్ని సంవత్సరాల తరబడి ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని ఇతర స్థలంలో తరలిస్తున్నారని, వర్ధన్నపేట చుట్టుపక్కల గ్రామాల ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన 100 పడకల ఆసుపత్రి ఇప్పుడు ఉన్న పట్టణ కేంద్రంలోని హాస్పిటల్ స్థలంలోనే నిర్మించాలని కోరుతూ, రిలే నిరాహార దీక్ష రెండవ రోజుకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాస్ రాష్ట్ర అధ్యక్షులు జన్ను రాములు మాదిగ మాట్లాడుతూ, “వర్ధన్నపేట నియోజకవర్గంలోని గ్రామాల ప్రజలకు ఆపదకాలంలో అన్ని వసతులు అందుబాటులో ఉండే ఆసుపత్రిని వేరే స్థలంలో తరలించడం సహించరాదని” హెచ్చరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు : మాజీ కౌన్సిలర్ తోటకూరి రాజమణి మాజీ బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు శ్రీధర్ వంద పడకల సాధన సమితి సభ్యులు సురేష్, నాగార్జున, లక్ష్మణ్, రాజు తదితరులు.

# ట్రినిటీలో పల్లె పండుగ.. సంక్రాంతి సంబరం

- అలరించిన అష్టలక్ష్ముల వేషధారణ, గోదాదేవి కల్యాణం
- పంటల సాగు విధానాన్ని ప్రదర్శించిన విద్యార్థులు
- నాట్లు వేయడం నుండి ధాన్యం దంచడం వరకు.. అంతా లైవ్!
- భోగి మంటలతో వేడుకలు ప్రారంభించిన చైర్మన్, డైరెక్టర్










చౌటుప్పల్, జనవరి 9 (తొలివెలుగు) : సంక్రాంతి పండుగ విశిష్టతను చాటేలా ట్రినిటీ విద్యాసంస్థల్లో శుక్రవారం నిర్వహించిన సంబరాలు మిన్నంటాయి. విద్యార్థులు వ్యవసాయ పనులైన పొలం దున్నడం, నాట్లు వేయడం, కలుపు తీయడం నుంచి ధాన్యం నూర్పిడి, తూర్పార పట్టడం, రోకళ్లతో దంచడం వరకు అన్ని ప్రక్రియలను ప్రత్యక్షంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. విద్యాసంస్థల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, డైరెక్టర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల భోగి మంటలు వెలిగించి వేడుకలను ప్రారంభించారు. అష్టలక్ష్మల వేషధారణలు, గోదాదేవి కల్యాణం, హరిదాసుల కీర్తనలు పండుగ శోభను ద్విగుణీకృతం చేశాయి. శిశు తరగతుల విద్యార్థులకు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు శివరాణి, మాలిక్, శ్రీవాణి, శ్రీదేవి, స్వప్న, నీరజ, మంజుల, జ్యోతి, కొండమ్మ, లక్ష్మీప్రియ, ప్రీతి, లోవకుమారి, అంజలి, సుమలత, చందన, స్వరూప, భార్గవి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి బాటలో లక్కారం.. మురుగు కాలువ పనులు ప్రారంభం

- డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య





చౌటుప్పల్, జనవరి 9 (తొలివెలుగు) : చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు లక్కారం గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. శ్రీరాంనగర్, శ్రీనగర్ కాలనీల్లో రూ.15 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోయ దేవేందర్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు సుర్వి నర్సింహ, స్థానిక మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్, మాజీ సర్పంచ్ పాశం సంజయ్ బాబు, మాజీ ఎంపీటీసీ కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, వార్డు అధ్యక్షులు పాశం శ్రీనివాస్, లందగిరి యాదయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు పాశం కృష్ణ, జాజుల గణేష్, ఊరడి వెంకటేష్, మహాజన్, గోకనబోయిన మహేష్, ఎర్రి శంకర్, బర్రి బాలరాజు, ఎర్రి యాదగిరి, లందగిరి వెంకటేష్, వంగూరి లింగస్వామి, నాగపాణి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణ రక్షణకే ‘హెల్మెట్’ నిబంధన







- చౌటుప్పల్‌లో పోలీస్ ఇన్‌స్పెక్టర్ వినూత్న ప్రచారం
- నిబంధనలు పాటించకుంటే జరిమానాలు తప్పవు
- పెట్రోల్ బంకుల వద్ద సీఐ మన్మథ కుమార్ తనిఖీలు

చౌటుప్పల్, జనవరి 9 (తొలివెలుగు) : వాహన చోదకుల భద్రతే లక్ష్యంగా చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో ‘నో హెల్మెట్ – నో పెట్రోల్‘ ప్రచారాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో పెట్రోల్ పోయవద్దని బంకు నిర్వాహకులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని నివారించడానికే ఈ నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.